## శభాష్.. శ్రీనివాస్



- సీపీఆర్ చేసి మహిళా ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్
- అభినందించిన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల తెలంగాణ చౌక్, మే 25: తండ్రి మరణవార్త విని గుండెపోటుతో కుప్పకూలిన మహిళను ఓ కానిస్టేబుల్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. సిరిసిల్లలోని గాంధీనగర్‌కు చెందిన చిలగాని అనూహ్య శనివారం ఉదయం తండ్రి మరణవార్త విని బోరున విలపిస్తూ చాతిలో నొప్పి అంటూ కుప్పకూలిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు కేకలు వేయడంతో అటుగా రోడ్డుపై నుంచి వెళ్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస్ గమనించి వారి ఇంట్లోకి వెళ్లాడు. అనూహ్యకు గుండెపోటు వచ్చిందని గుర్తించి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. తర్వాత ఆమెను సొంత వాహనంలో పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించాడు. చాకచక్యంగా వ్యవహరించి మహిళా ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్‌ను ఎస్పీ అఖిల్‌మహాజన్, పలువురు పోలీసు అధికారులు అభినంచారు. శ్రీనివాస్‌కు అనూహ్య కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు రెడీ

**అత్యంత పకడ్బందీగా కౌంటింగ్‌కు ఏర్పాట్లు**
**కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్‌ల పరిధిలో**
**1,240 మంది సిబ్బందికి విధులు**



- కౌంటింగ్ చేసే వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు
- లెక్కింపు విధానంపై రేపు కలెక్టరేట్లలో శిక్షణ
- పూర్తయిన ర్యాండమైజేషన్

**సార్వత్రిక ఎన్నికల సమరంలో తుది ఘట్టానికి ఈసీ సిద్ధమవుతున్నది. ఇటీవలే ఓటింగ్ పూర్తయిన నేపథ్యంలో కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలకు వచ్చే నెల 4న జరిగే కౌంటింగ్‌కు అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లెక్కింపు కొనసాగనుండగా, సెగ్మెంట్‌కు ఒక్కో హాల్‌ను కేటాయించి, అవసరమైన టేబుళ్లు, ఆయా పార్టీల ఏజంట్లు పరిశీలించేలా ఇనుప జాలీలతో కూడిన లైనింగ్స్‌ను నిర్మించింది. మొత్తంగా రెండు లోక్‌సభ స్థానాలకుగాను 1,240 మంది సిబ్బందికి విధులు కేటాయించి, ర్యాండమైజేషన్ కూడా పూర్తిచేసింది. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు విధానంపై సోమవారం ఆయా కరీంనగర్, పెద్దపల్లి కలెక్టరేట్లలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నది.**

కరీంనగర్, మే 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కలెక్టరేట్ : లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఈ నెల13న ముగిసింది. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగనున్నది. అందుకు అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులు లెక్కింపు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లెక్కించనుండగా, ఒక్కో అసెంబ్లీకి ఒక్కో హాల్‌ను కేటాయించి, అందులో అవసరమైన టేబుళ్లు, లెక్కింపును ఆయా పార్టీల ఏజెంట్లు పరిశీలించేలా ఇనుప జాలీలతో కూడిన లైనింగ్స్ నిర్మాణం కూడా పూర్తి చేశారు. కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం 1,240 మంది సిబ్బందికి విధులు కేటాయించారు. వీరికి అవసరమైన శిక్షణ కూడా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి కాగా, ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు విధానంపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల సంఘం సూచనల మేరకు సమగ్ర విధానం రూపొందించారు. పకడ్బందీగా ఓట్లు లెక్కించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా, కరీంనగర్ మినహా మిగతా 13 సెగ్మెంట్లకు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేసి లెక్కించనున్నట్టు తెలిపారు. ఇక కరీంనగర్‌లో పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేకంగా 2 టేబుళ్లు, పెద్దపల్లిలో ఒక టేబుల్ కేటాయించనున్నారు. కరీంనగర్ అసెంబ్లీ పరిధిలో అత్యధిక ఓటర్లుండడంతో 18 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. కరీంనగర్ లోక్‌సభ ఓట్ల లెక్కింపు నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించనుండగా, పెద్దపల్లి లోక్‌సభ ఓట్ల లెక్కింపు మంథనిలోని జేఎన్టీయూలో చేపట్టనున్నారు. ఓట్ల లెక్కింపులో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లతో పాటు గ్రూప్ డీ సిబ్బంది కూడా పాల్గొననున్నారు. ఈవీఎంల లెక్కింపులో ఒక్కో టేబుల్‌కు సీఎస్, సీఏ, ఎంఓలు ఒక్కొక్కరు చొప్పున, ఇద్దరు గ్రూప్ డీ సిబ్బందిని కేటాయించారు. కరీంనగర్ లోక్‌సభ ఓట్ల లెక్కింపుకు 673 మంది, పెద్దపల్లిలో 567 మందిని వినియోగించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కరీంనగర్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చేపట్టనుండగా, పెద్దపల్లిలో మాత్రం 26 టేబుళ్లు ఏర్పాటు చేసి ఒకేసారి లెక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. 12,897 పోస్టల్ బ్యాలెట్లు పోలవగా, వీటిని లెక్కించేందుకు 10 స్కానర్లు, 10 లాప్‌టాప్‌లు ఉపయోగించనున్నారు. ఒక్కో టేబుల్‌కు ఒక ఏఆర్‌వోతోపాటు ఒక సీఎస్, ఇద్దరు సీఏలు, ఒక ఎంవో, 14 మంది ఇతర సిబ్బందిని వినియోగించనున్నారు. లెక్కింపు సందర్భంగా కేంద్రాల సమీపంలో భారీ బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పోలీసు సిబ్బందితో పాటు నాలుగు కంపెనీల పారామిలటరీ బలగాలను కూడా భద్రతకు వినియోగిస్తున్నామని ఎన్నికల అధికారులు వెల్లడిస్తున్నారు.

### ప్రత్యేక గుర్తింపు కార్డులు.. ఫోన్లు నిషేధం

ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి ఎన్నికల సంఘం ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు అందించనున్నారు. మూడంచెల భద్రతా విధానంలో ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా, గుర్తింపుకార్డులున్న వారిని మాత్రమే లెక్కింపు టేబుళ్ల వద్దకు అనుమతించనున్నారు. లెక్కింపు విధుల్లో వారికి జిల్లా ఎన్నికల అధికారి కార్డులు జారీ చేయనున్నారు. కాగా, లెక్కింపు కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది కూడా తమ వెంట మొబైల్ ఫోన్లు తీసుకెళ్లకుండా ఈసారి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, లెక్కింపు కేంద్రంలో వివిధ అవసరాల కోసం మొబైల్స్ వినియోగం తప్పనిసరి కాగా, ఈవీఎం స్ట్రాంగ్‌రూముల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి మినహాయింపునివ్వాలంటూ ఉన్నతాధికారులను కోరినట్లు తెలుస్తున్నది.

**పెద్దపల్లి లోక్‌సభలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపునకు అవసరమైన టేబుళ్లు, సిబ్బంది వివరాలు**

| అసెంబ్లీ సెగ్మెంట్ | టేబుళ్లు | సీఎస్ | సీఏ | ఎంవో | గ్రూపు డి సిబ్బంది | ఇతర సిబ్బంది |
|---|---|---|---|---|---|---|
| చెన్నూరు | 14 | 15 | 15 | 16 | 30 | 5 |
| బెల్లంపల్లి | 14 | 15 | 15 | 16 | 30 | 5 |
| మంచిర్యాల | 14 | 15 | 15 | 16 | 30 | 5 |
| ధర్మపురి | 14 | 15 | 15 | 16 | 30 | 5 |
| రామగుండం | 14 | 15 | 15 | 16 | 30 | 5 |
| మంథని | 14 | 15 | 15 | 16 | 30 | 5 |
| పెద్దపల్లి | 14 | 15 | 15 | 16 | 30 | 5 |

**కరీంనగర్ లోక్‌సభ ఓట్ల లెక్కింపులో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పాల్గొనే సిబ్బంది వివరాలు**

| | ఈవీఎంల లెక్కింపునకు అవసరమైన సిబ్బంది | | | | పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు అవసరమైన సిబ్బంది | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| అసెంబ్లీ సెగ్మెంట్ | టేబుళ్లు | సీఎస్ | సీఏ | ఎంవో | టేబుళ్లు | సీఎస్ | సీఏ | ఎంవో | పరిశీలకులు |
| కరీంనగర్ | 18 | 22 | 22 | 22 | 2 | 2 | 4 | 3 | 2 |
| చొప్పదండి | 14 | 17 | 17 | 17 | 2 | 2 | 4 | 3 | 2 |
| వేములవాడ | 14 | 17 | 17 | 17 | 2 | 2 | 4 | 3 | 2 |
| సిరిసిల్ల | 14 | 17 | 17 | 17 | 2 | 2 | 4 | 3 | 2 |
| మానకొండూర్ | 14 | 17 | 17 | 17 | 2 | 2 | 4 | 3 | 2 |
| హుజూరాబాద్ | 14 | 17 | 17 | 17 | 2 | 2 | 4 | 3 | 2 |
| హుస్నాబాద్ | 14 | 17 | 17 | 17 | 2 | 2 | 4 | 3 | 2 |



సిరిసిల్ల టౌన్: ఈదురుగాలులతో గోపాల్‌నగర్‌లో కారుపై విరిగిపడిన చెట్టు

# గాలివాన బీభత్సం

- పొద్దంతా దంచికొట్టిన ఎండ
- సాయంత్రం అకాల వాన
- పిడుగుపాటుకు లారీ డ్రైవర్ బలి
- రోడ్లపై విరిగిపడ్డ చెట్లు
- తెగిపడ్డ విద్యుత్ వైర్లు
- లేచిపోయిన ఇంటి పైకప్పులు

రాజన్న సిరిసిల్ల, మే 25 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శనివారం గాలివాన బీభత్సం సృష్టించింది. పొద్దంతా ఎండ దంచికొట్టినా.. సాయంత్రం నాలుగు గంటల తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గాలి దుమారానికి తోడు ఉరుములు, మెరుపులు, పిడుగులతో అకాల వర్షం భయపెట్టింది. చాలా చోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడగా, రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ తీగలు తెగడంతోపాటు పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. దీంతో అక్కడక్కడా చీకట్లు అలుముకున్నాయి. ఇటు తీవ్రంగా వీచిన గాలికి చాలా చోట్ల ఇండ్ల పైకప్పులు, రేకులు లేచిపోయాయి. మల్లాపూర్‌తోపాటు రత్నాపూర్, మేడిపల్లి మండలంలోని దమ్మన్నపేట, దేశాయిపేట, రాగోజిపేట, కథలాపూర్ మండలంలోని గంభీర్‌పూర్, తాండ్ర్యాల, పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రం, నాంసానిపల్లి, లంబాడితండా, సిరిసిల్ల పట్టణంలోని గోపాల్‌నగర్, బీవైనగర్, కోనరావుపేట మండల కేంద్రంతో పాటు బావుసాయి పేట, కొండాపూర్, ధర్మారం, నిమ్మపల్లి, నిజామాబాద్, చందుర్తి మండలం, ముస్తాబాద్ మండల కేంద్రం, బందనకల్, గూడెం, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర, అక్కపల్లిలో భారీ గాలులతో వర్షం కురవగా భారీగా నష్టం వాటిల్లింది. దేశాయిపేటలో తాటిచెట్టు నేల కూలి రెండు మేకలు మృతిచెందాయి. భీమారం మండలం రాగోజిపేటలో తాటిచెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. లంబాడితండా సమీపంలోని విద్యుత్ టవర్ లైన్ తెగిపోయి రాత్రి మంటలు చెలరేగాయి. ముస్తాబాద్ మండలం బందనకల్‌లో కరుణాకర్‌రెడ్డి, ముస్తాబాద్‌లో కృష్ణతోపాటు పలువురు చెట్లకింద కార్లు నిలపగా చెట్ల కొమ్మలు విరిగి ధ్వంసమయ్యాయి.



కథలాపూర్: విద్యుత్ తీగలపై ఎగిరిపడ్డ రేకు

### పిడుగుపాటుతో లారీ డ్రైవర్ మృతి

జగిత్యాల పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ మహమ్మద్ ఖాదిర్ శనివారం సాయంత్రం మల్లాపూర్‌లోని ఓ ఎరువుల దుకాణం మందు బస్తాలను దించుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పిడుగుపాటుకు గురై గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్ఐ లచ్చయ్య పరిశీలించి ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఖాదిర్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



కోనరావుపేటలో మెయిన్ లైన్ కరెంటు తీగలపై వేలాడుతున్న చెట్టుకొమ్మ



ఓదెల: నాంసానిపల్లిలో లేచిపోయిన ఇంటి పై కప్పు రేకులు



కోనరావుపేట: బావుసాయిపేటలో గాలికి చెల్లచెదురైన రేకుల దుకాణం

